క్లుప్తంగా

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

కుప్పం: పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. గోవులకు పూజలు చేశారు. ఆట, పాటలతో సంతోషంగా గడిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలు అందజేశారు.

15న మకరజ్యోతి దర్శనం



సదుం: అయ్యప్ప ఆలయం

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమల్లె అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 15న మకరజ్యోతి దర్శనాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు గ్రామంలోని సదుమమ్మ ఆలయంలో స్వామి వారి తిరు ఆభరణాలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం వాటిని ఊరేగింపుగా తీసుకువచ్చి అయ్యప్ప ఆలయానికి సమర్పించనున్నారు. సాయంత్రం ఆలయ సమీపంలోని కొండల్లో మకరజ్యోతి దర్శనం ఇవ్వనుంది. భారీగా తరలివచ్చే భక్తుల కోసం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి నుంచి ఆలయ పరిసరాల్లో స్వచ్ఛ తీర్థం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిసరాల్లో ఆదివారం నుంచి 19వ తేదీ వరకు స్వచ్ఛ తీర్థం కార్యక్రమంలో భాగంగా సేవా కార్యక్రమాలు చేపటనున్నట్లు చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. ఇందులో ఆలయ అధికారులు ఆలయ మాడ వీధులు, ప్రధాన దేవాలయం, కోనేరు, బస్టాండు, లడ్డూ పోటు, అన్నదాన సత్రం, వినాయక సదన్, కల్యాణ కట్ట, డార్మిటరీ తదితర ప్రాంతాలను శుద్ధి చేస్తారని పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఇరువారం వద్ద శనివారం టూటౌన్ పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించామని సీఐ ఉలశయ్య తెలిపారు. ఈ దాడుల్లో రూ.10,200 సీజ్ చేశామన్నారు. 8 మంది జూదరులను అరెస్ట్ చేశామని చెప్పారు.

వినాయకుని సేవలో కర్ణాటక హైకోర్టు జడ్జి



జడ్జికి స్వామి వారి చిత్ర పటం అందజేస్తున్న ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శనివారం ఉదయం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేష్ నాయక్ దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి స్వాగతం పలికి స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా అధికారులు తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, చిత్తూరు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దే వైద్యం

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య అన్నారు. శనివారం గుడిపాల మండలంలోని రామభద్రాపురం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 63 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్స చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. చంద్ర, అనిత, అనురాధ, శివగామి పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు సాక్షాత్కరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం అభిషేక సేవ నిర్వహించి శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి కల్యాణోత్సవం చేశారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవను చేపట్టారు. శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగారు.

చురుగ్గా మోడల్ స్కూల్ నిర్మాణ పనులు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మోడల్ స్కూల్ హాస్టల్ భవనం



నిర్మాణంలో ఉన్న మోడల్ స్కూల్ భవనం

- ప్రారంభానికి సిద్ధమైన బాలికల హాస్టల్ భవనం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలో చేపట్టిన మోడల్ స్కూల్ భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రొంపిచెర్ల మండలానికి కేంద్ర ప్రభుత్వం 2008లో ఆదర్శ పాఠశాలను మంజూరు చేసింది. బొమ్మయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలలోనే మోడల్ స్కూల్‌ను ప్రారంభించారు. ప్రత్యేకంగా భవనాలు నిర్మించాలనే ఉద్దేశంతో ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఐదు ఎకరాల భూమిని కేటాయించారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. భూమికి పరిహారం ఇవ్వలేదని రైతు కోర్టును ఆశ్రయించడంతో అప్పట్లో పనులు ఆగిపోయాయి. తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం మోడల్ స్కూల్ గురించి పట్టించుకోలేదు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలోని నేషనల్ హైవే పక్కన భూమి కేటాయించారు. నాడు–నేడు కింద రూ.3.30 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో అధికారులు టెండర్లు నిర్వహించి పనులను ప్రారంభించారు. 34 తరగతి గదులతో భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అదేవిధంగా రూ.2.60 కోట్లతో బాలికలకు ప్రత్యేక హాస్టల్ భవనాన్ని 25 గదులతో నిర్మించారు. వారం పది రోజుల్లో భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సత్తా చాటుతున్న విద్యార్థులు

రొంపిచెర్ల మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో సత్తా చాటుతున్నారు. దీనికి తోడు ఇక్కడ ఇంగ్లిషు మీడియం ఉండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించేందుకు మక్కువ చూపుతున్నారు. ఇందులో సీటు కోసం పోటీ పడుతున్నారు. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి విద్యా బోధన సాగుతోంది. వచ్చే ఏడాది నుంచి ఇంటర్ తరగతులను కూడా చేపట్టనున్నట్టు ప్రిన్సిపాల్ సరళ తెలిపారు.

హాస్టల్ భవనంలోనే తరగతులు

మోడల్ స్కూల్ తరగతి గదుల నిర్మాణం చురుగ్గా జరుగుతుంది. అంతవరకు హాస్టల్ భవనంలోనే తరగతి గదులను నిర్వహించాలని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. సంక్రాంతి పండుగ తర్వాత హాస్టల్ భవనాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మోడల్ స్కూల్‌లో ఉత్తమ ఫలితాలు



రొంపిచెర్ల మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఇక్కడ ఇంగ్లిషు మీడియంలో విద్యాబోధన సాగుతోంది. ఇప్పటికే పలువురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో మోడల్ స్కూల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం.

– మీనాక్షి, పాఠశాల చైర్మన్

‘గరుడ సేవను ఘనంగా నిర్వహిద్దాం’



మాట్లాడుతున్న బలిజ కులస్తులు

వి.కోట: పట్టణంలో వెలసిన శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రతి ఏటా ఫిబ్రవరి నెలలో నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని మండల బలిజ కులస్తులు నిర్ణయించారు. వారు శనివారం స్థానిక రామాలయంలో ప్రత్యేక సమావేశమయ్యారు. బలిజ సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ గరుడ సేవను విజయవంతం చేయడానికి మండలంలోని బలిజ కులస్తులంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్, సభ్యులు జీఎం సుబ్బన్న, నాగరాజేంద్ర, శబరీష్, మూర్తి, పాట్టు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

15న అయ్యప్ప ఆలయానికి మంత్రి పెద్దిరెడ్డి రాక

పులిచెర్ల(కల్లూరు): మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం ఉదయం 7 గంటలకు మండలంలోని పాళెంకొండపై వెలసిన ఆనందగిరి అయ్యప్ప స్వామి ఆలయానికి విచ్చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు తప్పక హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్ షాదీ తోఫా రూ.లక్ష పంపిణీ



షాదీ తోఫా నగదు అందజేస్తున్న అలీమ్‌బాషా, ఇంతియాజ్‌ఖాన్

పుంగనూరు: పట్టణంలోని చెంగారెడ్డివీధికి చెందిన అమానుల్లా కుమార్తెకు వైఎస్సార్ షాదీ పథకం కింద రూ.లక్ష అందజేసినట్టు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ముస్లిం మైనారిటీ యువతులకు వైఎస్సార్ షాదీ తోఫా పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. నాయకులు ఇంతియాజ్‌ఖాన్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న బట్టందొడ్డికి చెందిన భక్తులు

పెద్దపంజాణి: మండలంలోని బట్టందొడ్డి పంచాయతీకి చెందిన సుమారు 150 మంది భక్తులు శనివారం తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ప్రతి సంవత్సరం కాలినడకన తిరుమల చేరుకుని స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని భక్తులు తెలిపారు. ఇందులో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శంకరప్ప, మాజీ సర్పంచ్ భాగ్యమ్మ పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 276 మంది ఎంపిక

కుప్పం: కుప్పం డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 276 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెర్ పర్సన్ శాంత నాగరాజ్ తెలిపారు. టెక్ మహేంద్ర, టీవీఎస్, యూనియన్ బ్యాంక్, అశోకా లేల్యాండ్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన 276 మందికి ఆఫర్ లెటర్స్ అందజేసినట్టు తెలిపారు.

28న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక



బ్రాహ్మణ వధూవరుల పరిచయ పోస్టర్లను విడుదల చేస్తున్న శేషగిరిరావు, రామమూర్తి

పుంగనూరు: తిరుపతి పట్టణంలోని ఇస్కాన్ మందిరం రోడ్డులో ఉన్న కంచి కామకోటి పాదుకా మఠంలో ఈ నెల 28న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సంఘం నాయకులు శేషగిరిరావు, కాసలనాటి రామమూర్తి తెలిపారు. వారు శనివారం పుంగనూరులో పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ గాయిత్రీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 32వ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ వధూవరులు తమ పూర్తి వివరాలతో పరిచయ వేదికలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు మధు, కృష్ణమూర్తి, గిరి, శ్రీనివాసరావు, రమణరావు, అశ్వర్థనారాయణ, మల్లికార్జున, ప్రణీత్, రాజేష్, మహేష్, పవన్, విహారి, వినోద్‌అర్ష పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన వ్యక్తి

చిత్తూరు అర్బన్: నగరానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ భారతి తెలిపారు. వివరాలు ఇలా.. మిట్టూరులో కాపురం ఉంటున్న ప్రభాకర్ (36) బేకరీ షాపు నిర్వహిస్తున్నాడు. అయితే అప్పులు ఎక్కువ కావడంతో ఈనెల 11వ తేదీ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా, అతడి ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న పూర్వ విద్యార్థులు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98లో పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్నేహితులతో కలిసి సంతోషంగా గడిపారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పేద విద్యార్థులను ఆదుకునేలా కార్యక్రమాలను రూపొందించాలని నిర్ణయించుకున్నారు.

మొక్కలు నాటుదాం

పాలసముద్రం : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయ ఆవరణలో తమ సిబ్బందితో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పెంచడంతో వాతావరణ మార్పులు వస్తాయన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని తెలిపారు. మొక్కలకు మధ్యాహ్న భోజన విరామం సమయంలో నీరుపోసి వాటిని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



ప్రకృతి వ్యవసాయం రైతులకు అవగాహన కల్పించి ర్యాలీ చేస్తున్న రైతులు

పాలసముద్రం: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా పంటను సాగు చేయడం వల్ల రసాయనాల వాడకం అవసరం ఉండదని, జీవామృతం కాషాయాలతో సాగు చేయండంలో రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎస్ఎఫ్ఎంటీ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురంలో రైతులకు సర్పంచ్ గాలి మహేష్‌బాబు సమక్షంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంలో చెరుకు పంట సాగు చేయడంతో ద్వారా చీడపీడల సమస్య ఉండదని, అధిక దిగుబడుల కోసం జీవామృతం వాడాలన్నారు. కలుపు నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ ప్రకృతి వ్యవసాయంలో చెరుకు పంట సాగు చేసి, తద్వారా ఉత్పత్తయ్యే బెల్లంను తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తామన్నారు. రైతులకు మార్కెట్ ధర కన్నా ఐదుశాతం ఎక్కువ టీటీడీ కొనుగోలు చేస్తామని తెలిపారు. అందువల్ల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పీఆర్పీ ఉష, ఐసీఆర్‌పీ ప్రతాప్, మునియమ్మ, రైతులు పాల్గొన్నారు.

మేలు చేసిన వారికి అండగా నిలవండి



చీర, పసుపు, కుంకుమ అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్ భార్య దుర్గ

శాంతిపురం: ప్రతి కుటుంబానికీ మేలు చేసిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని, ప్రతి నిత్యం కుప్పం ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్సీ భరత్‌కు అండగా నిలవాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ కోరారు. ఆమె శనివారం తుమ్మిశి, దుంకుమాకనపల్లి, తులసినాయనపల్లి, నడింపల్లి గ్రామాల్లో ‘జగనన్నతో జనం– భరతన్నతో మనం’ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు సంక్రాంతి పండుగ సందర్భంగా చీరలు, గాజులు, పసుపు కుంకుమ అందజేశారు. ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో ఆర్థిక లబ్ధి చేకూర్చిందన్నారు. మళ్లీ అలాంటి పాలనకే పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వైస్ ఎంపీపీ పట్టాభి, సర్పంచ్ చంగమరాజు, ఎంపీటీసీ బీఎస్ వెంకటేశు, నాయకులు చలపతి, రమేష్, వీరభద్రప్ప, సాగర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండలంలోని బాల ఓబనపల్లికి చెందిన చిన్నమునెప్ప, 89 పెద్దూరుకు చెందిన రాజమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ గ్రామాలకు చేరుకుని వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ మల్లిక, ఎంపీటీసీ వెంకటరమణ, నేతలు మురుగేష్, గోవిందప్ప, పార్వతమ్మ, మణి, చెంగారెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



సీఐ రాఘవరెడ్డి

పుంగనూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో కోడి పందేలు, పేకాట, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాఘవరెడ్డి తెలిపారు. ఆయన శనివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగను నిబంధనలకు లోబడి జరుపుకోవాలన్నారు. కోడి పందేలు, పేకాట, ఇతరత్రా జూదాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ముఖ్యంగా పండుగ సందర్భంగా చోరీలు జరిగే అవకాశాలు ఉన్నాయని, విలువైన వస్తువులు, నగదు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. భోగి, కనుమ, సంక్రాంతి సందర్భంగా పిల్లలు, వృద్ధులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



సీఐ లింగప్ప

జల్లికట్టు, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

వి.కోట: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో ఎక్కడైనా కోడి పందేలు, జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ లింగప్ప హెచ్చరించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ కోడి పందేలు ఆడడం చట్టరీత్యా నేరమన్నారు. మూగజీవాలను ఇబ్బంది పెట్టరాదన్నారు. జల్లికట్టు నిర్వహించడం ద్వారా అనేక మంది యువకులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. అనంతరం ప్రజలంతా సంకాత్రి పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఐ ఆకాక్షించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ చేస్తున్న సర్పంచ్

గంగవరం: మండలంలోని గండ్రాజుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు శనివారం సర్పంచ్ మల్లికార్జున ట్యాబ్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అగ్రస్థానంలో నిలబెట్టాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న ట్యాబ్స్ ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగనన్న ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు చదువులపై ప్రత్యేక శ్రద్ధ వహించి బాగా చదవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్, మాజీ సర్పంచ్ రాధాక్రిష్ణ, హెచ్ఎం మోహన్‌గోపాల్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయులు రవి పాల్గొన్నారు.

కుప్పంలో..



ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంఈవోలు

కుప్పం: స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో శనివారం కుప్పం మండలంలోని 27 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ట్యాబ్‌లు వచ్చినట్టు ఎంఈవోలు తెలిపారు. వాటిని సంక్రాంతి సెలవుల అనంతరం 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేయాలని హెచ్ఎంలకు సూచించారు. కుప్పం మండలంలో 1,490 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి అందరికీ ట్యాబ్‌లు వచ్చినట్టు పేర్కొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళహారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి



మాట్లాడుతున్న ట్రాఫిక్ డీఎస్పీ విష్ణు రఘువీర్

చిత్తూరు అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టిగా కృషి చేస్తున్నామని ట్రాఫిక్ డీఎస్పీ విష్ణు రఘువీర్ అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆయన శనివారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లడారు. రోడ్డు ప్రమాదాల కట్టడికి ట్రాఫిక్ పోలీసులు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్యలపై స్పందిస్తున్నారని చెప్పారు. ప్రజలు కూడా ట్రాఫిక్ నియమావళిని పాటిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల ప్రజల నుంచి స్పందన లభిస్తోందన్నారు. హెల్మెట్ ధరించడంతో పాటు వాహనాలు నడిపే వేగం తగ్గిందన్నారు. ముఖ్యంగా యువతకు అధిక వేగంతో బండి నడపడం వద్దన్నారు. రోడ్డు ప్రమాదానికి గురి కాకుండా కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. చిత్తూరు నగరంలో ట్రాఫిక్ సిగ్నల్‌ను ప్రారంభించనున్నామని ఆయన చెప్పారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఎస్ఐలు బాబు, జయప్ప తదితరులు పాల్గొన్నారు.